మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రొఫైల్



పేరు: చామకూర మల్లారెడ్డి
తల్లిదండ్రులు: దివంగత మల్లారెడ్డి, చంద్రమ్మ **పుట్టిన తేదీ:** 20.03.1954
వయస్సు: 69
విద్యార్హత: ఇంటర్మీడియట్
భార్య: కల్పన
కుమారులు: మహేందరెడ్డి, భద్రారెడ్డి
కూతురు: మమతారెడ్డి

- **నివాసం, స్వస్థలం:** జయానగర్ కాలనీ, న్యూబోయిన్‌పల్లి, సికింద్రాబాద్, కంటోన్మెంట్.
- **వృత్తి వ్యాపారం:** మల్లారెడ్డి, సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలు, మల్లారెడ్డి మెడికల్ కళాశాలల అధినేత.
- **రాజకీయ నేపథ్యం:** 2014లో టీడీపీలో చేరి టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరారు. రెండుసార్లు మేడ్చల్ నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. గత మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు.

– మేడ్చల్/మేడ్చల్‌రూరల్

మల్లారెడ్డి ధనబలంతో గెలిచాడు

- కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్
- కార్యకర్తలు అధైర్యపడొద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: పేదింటి బిడ్డయిన తనపై మల్లారెడ్డి ధనబలంతో గెలిచాడని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. ఎన్నికల ఫలితాల కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ మల్లారెడ్డి కుటుంబమంతా దుర్మార్గంగా వ్యవహరించి తనను ఓడించేందుకు రూ.500 కోట్లు ఖర్చుపెట్టారని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, ఇక్కడ తన కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే గెలిచినందుకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తాను కోరుతున్నానన్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని ఆపాలని, జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజలు మరో ఐదేళ్లు అవకాశం కల్పించారని, సేవచేసే అవకాశం కల్పించినందుకు అభివృద్ధి కోసం పనిచేయాలని కోరారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానన్నారు. తాను ఓడిపోయినా ధైర్యం చెడకుండా నా ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. రానున్న రోజుల్లో నా కోసం కష్టపడిన కార్యకర్తలు, సైన్యాన్ని కాపాడుకుంటానన్నారు.

కన్నుల పండువగా నానావిధ పత్రిపూజ




కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి(శివలింగం)కు వేదపండితులు నానావిధపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం అందులో ఆదివారం సెలవుదినం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివచ్చారు. సోమవారం స్వామివారి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు వేదపండితులు, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



ఘట్‌కేసర్‌లో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి అవసరమైన మేజిక్ ఫిగర్ రావడంతో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, బొక్కొనిగూడ చౌరస్తాలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, అనిత, ఆంజనేయులు యాదవ్, శివప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్‌ముదిరాజ్, చిత్తారి, సుధాకర్, జంగారెడ్డి, బాబురావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



ఘట్‌కేసర్: కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంత్‌చారి వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి అమరుడయ్యాడని పలువురు నాయకులు అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనిత, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్‌ముదిరాజ్, రహమాన్, చిత్తారి, సుధాకర్, నర్సింహారెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీదండ్లగడ్డ వీరాంజనేయ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం పక్కనున్న అయ్యప్ప ఆలయం నుంచి శివారెడ్డిగూడ వరకు స్వామి వారిని ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

ఆశీర్వదించినందుకు.. కృతజ్ఞతలు



కౌంటింగ్ సెంటర్‌లోకి వెళ్తున్న మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్/మేడ్చల్: నేను మేడ్చల్ ఎమ్మెల్యేగా చేసిన పనిని గుర్తించి మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజానికానికి ధన్యవాదాలు అంటూ మేడ్చల్ ఎమ్మెల్యేగా రెండవసారి గెలుపొందిన చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర హోలీమేరి కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద గెలుపొందిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎప్పటికీ సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలను మరిచిపోనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వారు కూడా ఆరు గ్యారంటీలు పెట్టారని, వాటని అమలు చేస్తే సంతోషకరం అన్నారు. మేడ్చల్, మల్కాజిగిరిలో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి బాధలో తాము డబ్బులు పెట్టి గెలిచామంటున్నారని తెలిపారు. తనకు రాజకీయ అనుభవం పెద్దగా లేదని సడెన్‌గా ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి అయిపోయానని, ఇప్పుడు సడెన్‌గా ప్రతిపక్షంలో కూర్చోబోతున్నానన్నారు. నేను క్యాబినేట్‌లో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఒక్కటేనని, తాను ఎక్కడ కూర్చున్నా ప్రజలకు సేవచేసే మనిషినన్నారు.



ఎమ్మెల్యేగా గెలిచాక ధ్రువపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లాకు కెప్టెన్‌గా వ్యవహరించి గెలిపించా..

మేడ్చల్ జిల్లాలో ఉన్న 5 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందడంపై మల్లారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఎమ్మెల్యేల పనితీరును ప్రజలు గుర్తించి మరోసారి గెలిపించారన్నారు. తాను జిల్లా మంత్రిగా, కెప్టెన్‌గా ఉన్నా కాబట్టే జిల్లాలో క్లీన్ స్వీప్ చేశామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి



విజయం తర్వాత మల్లారెడ్డి అభివాదం

మేడ్చల్ మల్లారెడ్డి దే..

వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా..



మేడ్చల్/మేడ్చల్ రూరల్: రాష్ట్రంలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో మేడ్చల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి మల్లారెడ్డి విజయం సాధించారు. ఆదివారం నిర్వహించిన ఫలితాల్లో ఆయన మేడ్చల్ నుంచి గెలిచి రెండోసారి ఎమ్మెల్యే అయ్యారు.

33,419 ఓట్ల మెజార్టీతో విజయం..

బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌పై 33,419 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి రెండోసారి మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మేడ్చల్ నుంచి 14వ ఎమ్మెల్యేగా చరిత్రలో నిలిచాడు. 1,86,017 ఓట్లు పొంది మొదటి స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి ఉండగా, రెండవ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ 1,52,598 ఓట్లతో మూడవ స్థానంలో 50,535 ఓట్లతో బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు.

మొదటి రౌండ్ నుండి ఆధిక్యత

భోగారంలోని హోలిమేరి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించగా మల్లారెడ్డి ఉదయాన్నే సెంటర్‌కు వెళ్లాడు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు తన పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయన ఓట్లు సాధించారు. ప్రత్యర్థి ప్రాంతం నుంచి గణనీయమైన ఓట్లు సాధించి 33,419 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌పై విజయం సాధించారు. ప్రతి రౌండ్‌లో 5వేల ఓట్ల నుంచి 10వేల ఓట్ల వరకు మెజార్టీ సాధించి స్పష్టమైన ఆధిక్యత కొనసాగించారు. పోస్టల్ బ్యాలెట్ నుంచి 21వ రౌండ్ వరకు ఆధిక్యత కనబర్చారు.

శ్రీభవానీరామలింగేశ్వర స్వామి సేవలో మల్లారెడ్డి

కీసర: మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డి ఆదివారం సాయంత్రం కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి సేవలో పాల్గొన్నారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని చామకూర మల్లారెడ్డికి అందజేశారు.



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సేవలో మంత్రి మల్లారెడ్డి

బీఆర్‌ఎస్‌కు తగ్గిన మెజార్టీ

- గతంలో మల్లారెడ్డికి మెజార్టీ 87,990
- ఈసారి 33,419 మెజార్టీ

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లారెడ్డి 87,990 ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించగా తాజాగా ఆయన మెజార్టీ సగానికి పడిపోయింది. గత ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ రాకున్నా ఈసారి 33,419 ఓట్ల మెజార్టీతోనే మల్లారెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, ప్రభుత్వ వ్యతిరేఖత పనిచేసినా మల్లారెడ్డి వాటిని తట్టుకుని విజయం సాధించారు. కాంగ్రెస్ వైపు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, హరివర్ధన్‌రెడ్డి వంటివారు అభ్యర్థి వజ్రేష్ యాదవ్‌కు అండగా నిలబడ్డా అన్నీ తానై బీఆర్‌ఎస్ రాజకీయం నడిపి విజయం వైపు దూసుకెళ్లారు. కాంగ్రెస్ వారు ఆశలు పెట్టుకున్న బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కార్పొరేషన్లలో పోల్ మేనేజ్‌మెంట్ కచ్చితంగా నిర్వహించి తనకు ఎవరూ పోటీ లేరని చెప్పిన మాటలను మరోసారి నిరూపించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ సొంత ప్రాంతం ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో ఆయన సత్తా చాటలేకపోవడం, మల్లారెడ్డి, ఆయన అనుచరులు పక్కా రాజకీయం నడపడంతో ఆయన గెలుపు సులువైంది.

19 రౌండ్లలో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: మేడ్చల్‌లో ఓట్లను 21 రౌండ్‌లలో లెక్కించగా 19 రౌండ్‌లలో బీఆర్‌ఎస్, రెండు రౌండ్‌లలో కాంగ్రెస్ ఆధిక్యం కనబరిచింది. మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్ 2,913, రెండవ రౌండ్‌లో 2,692, 3వ రౌండ్‌లో 1,864, 4వ రౌండ్‌లో 2,665, 5వ రౌండ్‌లో 2,096, 6వ రౌండ్‌లో 283, 7వ రౌండ్‌లో 217, 8వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 349, 9వ రౌండ్‌లో 1,425 బీఆర్‌ఎస్, 10వ రౌండ్‌లో 1,981, 11వ రౌండ్‌లో 1,968, 12వ రౌండ్‌లో 833, 13వ రౌండ్‌లో 2,885, 14వ రౌండ్‌లో 1,326, 15వ రౌండ్‌లో 454, 16వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 396, 17వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 308, 18వ రౌండ్‌లో 2,455, 19వ రౌండ్‌లో 3,993, 20వ రౌండ్‌లో 2,230, 21వ రౌండ్‌లో 2,090, బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి ఓట్లు సాధించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ ఆధిక్యం.

చెల్లని ఓట్లు 86..

నియోజకవర్గంలో వృద్ధులు, ఉద్యోగులు 3,514 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 86మంది ఓట్లు చెల్లలేదు. కాంగ్రెస్‌కు 2,081, బీఆర్‌ఎస్‌కు 828, బీజేపీకి 480, బీఎస్‌పీకి 21, నోటాకు 18 ఓట్లు దక్కాయి.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు

మేడ్చల్ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి విజయం సాధించడంతో అన్ని ప్రాంతాల్లో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు రంగులు చల్లుకుని, మిఠాయిలు పంచుకుని, బాణాసంచా కాల్చారు. మల్లారెడ్డి అన్ని రౌండ్‌లలో సంపూర్ణ ఆధిక్యత సాధించడంతో మధ్యాహ్నం నుంచి సంబరాలు జరుపుకున్నారు.



బొక్కొనిగూడలో బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



అన్నోజిగూడలో బాణాసంచా కాలుస్తున్న నాయకులు



నాగారం, దమ్మాయిగూడలో సంబురాల్లో బీఆర్‌ఎస్ నేతలు



మేడ్చల్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు



మల్లారెడ్డి ఇంటి వద్ద సంబురాలు

కలిసొచ్చిన అదృష్టం

- అనుహ్యంగా టికెట్ దక్కించుకున్న మర్రి.. వరించిన విజయం
- టికెట్ తిరస్కరించి కాంగ్రెస్ గూటికి మైనంపల్లి.. ఎదురైన పరాజయం
- మెదక్‌లో తనయుడు రోహిత్ విజయం..
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుపై సంతోషంలో మైనంపల్లి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అనుహ్యంగా బీఆర్‌ఎస్ టికెట్ దక్కించున్న చామకూర మల్లారెడ్డి స్వయాన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరిలో విజయం వరించింది. తనయుడి కోసం బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించిన టికెట్‌ను తిరస్కరించిన సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ గూటికి చేరి.. అదే నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసినా ఆయనకు దురదృష్టం వెంటాడటంపై స్థానికంగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందే బీఆర్‌ఎస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించగా, కొన్నిచోట్ల వివాదం రాజుకుంది. మల్కాజిగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రకటించగా, తన కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో మంత్రి హరీష్‌రావుపై పలు విమర్శలు చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న బీఆర్‌ఎస్ మల్కాజిగిరి టికెట్‌ను పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి మల్లారెడ్డికి స్వయాన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఖరారు చేసింది. ఈ నేపథ్యంలోనే మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీ బరిలోకి దిగి, విజయం సాధించారు.

- తనయుడికి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వకపోటంతో.. అధిష్టానంపై అలిగిన సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మైనంపల్లి తాను అనుకున్నట్లుగానే మెదక్ నుంచి తనయుడు రోహిత్‌కు కాంగ్రెస్ టికెట్ ఇప్పించడంతో పాటు ఆయన కూడా మల్కాజిగిరి నుంచి పోటీ చేశారు. అనూహ్య రాజకీయ పరిణామాల్లో భాగంగా రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచినా.. మైనపంల్లి మాత్రం మల్కాజిగిరి నుంచి ఓటమి పాలయ్యారు. అయితే.. కుమారుడు రోహిత్ మాత్రం మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. తాను ఓడిపోయినా తనయుడు రోహిత్ గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుండటంపై ఆయన సంతోషంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పోరాడి ఓడిన తోటకూర వజ్రేష్

అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి పోరాడి ఓడిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్(జంగయ్య) యాదవ్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వంతో కొట్లాడతానని పేర్కొంటున్నారు. అనూహ్యంగా ఎన్నికల్లో బడుగుబలహీన వర్గాల అభ్యర్థిగా ప్రజల మద్దతు కూడగట్టడంతో పాటు ఒక ధనవంతుడిని ఢీ కొట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాపాడతానని హామీ ఇచ్చారు. ధనబలంతో మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ ఎన్నికల్లో గెలిచినట్లు ఆరోపిస్తున్నారు.